సాక్షి
అనకాపల్లి
సోమవారం । 21 । ఆగస్టు । 2023

న్యూస్‌రీల్

గాజుల అలంకరణలో నూకాంబిక



అనకాపల్లిటౌన్: పట్టణంలో గవరపాలెం నూకాంబిక అమ్మవారు గాజుల అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. శ్రావణమాసంలో తొలి ఆదివారం కావడంతో అమ్మవారిని దర్శించుకునేందుకు అధికసంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారిని కనులపండువగా తిలకించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం ఏర్పడకుండా ఆలయ ఈవో బండారు ప్రసాద్ ప్రత్యేక చర్యలు చేపట్టారు. సోమ, మంగళవారాల్లో అమ్మవారు గాజుల అలంకరణలో దర్శనమివ్వనున్నట్టు ఆయన చెప్పారు.

చింతూరులో పులి పంజా

వారం వ్యవధిలో ఐదు పశువుల మృతి



గ్రామస్తులు తీసిన పులి పాదముద్ర ఫొటో

చింతూరు: మండలంలోని పెదశీతనపల్లి, కన్నాయిగూడెం నడుమ అటవీ ప్రాంతంలో పులి సంచారంతో ఈ ప్రాంత ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో ఐదు పశువులను పులి హతమార్చినట్లు పెదశీతనపల్లి గ్రామస్తులు ఆదివారం తెలిపారు. మడకం కన్నారావు, శ్యామల నర్సింహారావు, సోడె కన్నయ్య, మడివి కన్నయ్యలకు చెందిన ఐదు పశువులను చంపేయడంతో ఆర్థికంగా నష్టపోయామని వాపోయారు. తన బండెద్దులు మేత నిమిత్తం అడవికి వెళ్లగా, పులిదాడి చేయడంతో ఒక ఎద్దు అక్కడికక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన మరో ఎద్దుకు చికిత్స అందించినప్పటికీ మరణించిందని రైతు నర్సింహారావు కన్నీటి పర్యంతమయ్యాడు. పులి సంచరిస్తుండటంతో రాత్రుళ్లు బయటకు వెళ్లలేని పరిస్థితి నెలకొందని, అటవీ అధికారులు దీనిపై చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

26న జైలు వస్తువుల వేలం

ఆరిలోవ: విశాఖ కేంద్ర కారాగారంలో ఉపయోగంలో లేని వస్తువులను ఈ నెల 26న వేలం వేస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ కిశోర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. 30 వాటర్ డ్రమ్ములు, 18 టీ జార్లు, 200 వాటర్ టంబ్లర్స్, 600 ఎస్ఎస్ గ్లాసులు, 200 స్టెయిన్‌లెస్ స్టీల్ ప్లేట్లు, 100 సీలింగ్ ఫ్యాన్లు, 2 ఎస్ఎస్ రైస్ డ్రమ్ములు, ఓ బీపీఎల్ కలర్ టీవీ, ఓరియంటల్ వాల్ ఫ్యాన్, 6 ఎస్ఎస్ హాట్ బాక్స్‌లు తదితర వస్తువులను జైలు ఆవరణలో ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం వేస్తామన్నారు. ఆసక్తి గల వారు సమయం కంటే ముందుగా జైలు వద్దకు చేరుకుని రూ.2,000 ధరావత్తు చెల్లించాలన్నారు. వేలంలో నెగ్గని వారికి వెంటనే ధరావత్తు చెల్లించేస్తామన్నారు. మరిన్ని వివరాలకు 94904 42272ను సంప్రదించవచ్చు.

రేపు మినీ జాబ్‌మేళా

మురళీనగర్: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎంవీపీకాలనీలోని ఎస్.వి.వి.పి వి.ఎం.సి డిగ్రీ కాలేజీలో ఈ నెల 22న మినీ జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు కంచరపాలెం పాలిటెక్నిక్ కాలేజీలోని సంస్థ జిల్లా కార్యాలయం అధికారి సాయి కృష్ణ చైతన్య, డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్.జగదీష్ తెలిపారు. ఉదయం 9.30 గంటలకు డాక్టర్ రెడ్డీస్, వరుణ్ మోటార్స్ బజాజ్ డివిజన్, ర్యాండ్ స్టాడ్‌లలో 200 పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు జరుగుతాయని చెప్పారు. విశాఖతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాల్లోని అర్హులైన నిరుద్యోగులు ఇంటర్వ్యూలకు హాజరు కావొచ్చన్నారు. టెన్త్, ఇంటర్, డిగ్రీ, డిప్లమో పూర్తి చేసిన 18 నుంచి 40 ఏళ్ల మధ్య వయసు ఉన్న వారు అర్హులని, ఎంపికైన అభ్యర్థులకు అర్హతల ఆధారంగా రూ.10 వేల నుంచి రూ.20 వేల వరకు జీతభత్యాలుంటాయని చెప్పారు. విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం జిల్లాల్లోని మండలాల్లో ఉద్యోగం చేయాల్సి ఉంటుంది. మరిన్ని వివరాలకు 99593 77669, 92925 53352లో సంప్రదించవచ్చు.

విషాద మలుపు



- పాడేరు ఘాట్‌రోడ్డులో ఘోర ప్రమాదం
- ఇటీవల గాలులకు ఒరిగిన చెట్టుకొమ్మ
- దానిని తప్పించబోయి అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు
- ఐదు పల్టీలు కొట్టి.. 100 అడుగుల లోతులోకి..
- అక్కడ చెట్టు అడ్డడంతో నిలిచిన బస్సు
- లేదంటే పెను విషాదమే..
- సకాలంలో స్పందించిన అధికారులు
- హుటాహుటిన ఆస్పత్రికి క్షతగాత్రుల తరలింపు
- దిగ్భ్రాంతి వ్యక్తం చేసిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి
- బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశం



ఘాట్‌రోడ్డులో గుమిగూడిన జనం

సాక్షి, విశాఖపట్నం: నగరంలో పనులు ముగించుకొని కొందరు... చుట్టపు చూపునకు మరికొందరు.. దైవ దర్శనానికి ఇంకొందరు.. ఇలా వేర్వేరు ప్రాంతాలకు చెందిన వారితో వెళ్తున్న బస్సు ఘాట్ రోడ్డులో మలుపులు తిరుగుతోంది. రోజూ వెళ్లే రూట్‌లోనే జాగ్రత్తగా డ్రైవింగ్ చేస్తూ.. ప్రయాణికులను సురక్షితంగా వారి గమ్యస్థానాలకు చేర్చేందుకు డ్రైవర్ బస్సును ముందుకు తీసుకెళ్తున్నాడు. మరో అర గంటలో గమ్యస్థానానికి చేరుకుంటామని.. కొందరు ఫోన్లో తమ బంధువులకు, కుటుంబ సభ్యులకు చెబుతున్నారు. ఇంతలోనే వచ్చిన ఓ మలుపు.. వారి జీవితాల్ని విషాద మలుపులోకి నెట్టేసింది. కొద్ది రోజుల కిందట వీచిన గాలికి వాలిన చెట్టు కొమ్మను తప్పించి ముందుకెళ్లేందుకు డ్రైవర్ ప్రయత్నించగా.. ఇంతలో ఎదురుగా బైక్ వస్తోంది. దానిని తప్పించే ప్రయత్నంలో బస్సు అదుపు తప్పింది. రక్షణ గోడను ఢీకొట్టి.. లోయలోకి జారిపోయింది. ప్రయాణికులు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే.. ఒకటి కాదు.. రెండు కాదు.. 5 పల్టీలు కొట్టి 100 అడుగుల లోతులోకి వెళ్లిపోయింది. ఇదే చివరి ప్రయాణమని అంతా భావించారు. కానీ.. లోయలో ఉన్న ఓ చెట్టు అడ్డడంతో బస్సు నిలిచిపోయింది. ఈ ఘోర ప్రమాదం.. ఇద్దరి ప్రాణాలను గాల్లో కలిపేసింది. 28 మందిని క్షతగాత్రులుగా మార్చేసింది. ఒరిగిన చెట్టు కొమ్మ.. విషాదానికి కారణమైతే.. మరో చెట్టు 28 మంది ప్రాణాలను కాపాడింది. బస్సులో ప్రయాణిస్తున్న ప్రతి ఒక్కరికీ గాయాలైనా.. నాలుగు నెలల చిన్నారి మాత్రం సురక్షితంగా బయటపడింది.

డ్రైవర్ సహా మొత్తం 34 మంది ప్రయాణికులతో ఆదివారం మధ్యాహ్నం 12 గంటలకు విశాఖలో బయలుదేరిన బస్సులో డ్రైవరే టికెట్స్ జారీ చేస్తుంటారు. పాడేరు ఘాట్ రోడ్డులోని వ్యూ పాయింట్ సమీపంలోని మలుపు వద్ద ప్రమాదానికి గురైంది. పల్టీలు కొట్టి పడిపోతున్న బస్సు నుంచి బయటకు వచ్చేందుకు ప్రయాణికులు ప్రయత్నించినా సాధ్యం కాని పరిస్థితులు నెలకొన్నాయి. 5 పల్టీలు కొట్టిన తర్వాత 100 అడుగుల లోతుకు జారుకుంటూ వెళ్లిపోతున్న బస్సు.. లోయలో చెట్టు అడ్డడంతో ఆగిపోయింది. ఊపిరి పీల్చుకున్న ప్రయాణికులు బయటకు వచ్చేందుకు ప్రయత్నించారు. ఒళ్లంతా గాయాలతో రక్తపు మడుగు మాదిరిగా లోయ మారిపోయింది. ఇద్దరు ప్రయాణికులు పల్టీల ధాటికి ప్రమాద స్థలిలోనే మృతి చెందారు. వ్యూ పాయింట్ వద్ద స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టేందుకు ప్రయత్నించారు. 100 అడుగుల లోయ కావడంతో దిగేందుకు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

అమ్మవారి దర్శనానికి వెళ్తుండగా...

నాతవరం: పాడేరు ఘాట్ రోడ్డులో జరిగిన బస్సు ప్రమాదంలో నాతవరం మండలానికి చెందిన నలుగురు వ్యక్తులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. మండలంలో డి.యర్రవరం గ్రామానికి చెందిన బొట్టా నర్సింహామూర్తి, భార్య చిన్నమ్మలు, పిల్లలు గంగాభవాని, రమణలతో కలిసి ఆదివారం ఉదయం పాడేరు అమ్మవారి దర్శనానికి బయలుదేరి వెళ్లారు. మార్గమధ్యంలో జరిగిన బస్సు ప్రమాదంలో నర్సింహమూర్తి కుటుంబ సభ్యులు ఉన్నారు. ఈ ప్రమాదంలో చిన్నమ్మలు,గంగా భవాని, రమణలకు గాయాలయ్యాయి. వీరంతా విశాఖపట్నంలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. నర్సింహమూర్తి ఆదివారం రాత్రి ఫోన్‌లో డి.యర్రవరంలో కుటుంబ సభ్యులతో మాట్లాడారు. గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నామని తెలిపారు.

చెట్టు లేకపోతే ఘోరం జరిగిపోయేది

ఈ ప్రమాదాన్ని చూసిన స్థానికులు.. బస్సులో ఉన్న వారెవ్వరూ ప్రాణాలతో బయట పడరేమోనని భయాందోళనకు గురయ్యారు. ఇంతలో.. ఒక చెట్టు ఆ బస్సుని ఆపేసింది. దీంతో.. అంతా ఊపిరి పీల్చుకున్నారు. లేదంటే.. మరో 50 అడుగుల కింద ఉన్న దిగువ ఘాట్‌రోడ్డుపై బస్సు పడే ప్రమాదముంది. ఆ రోడ్డుకు బలంగా ఢీకొడితే.. మరింత ఘోరం జరిగేది. బస్సు అక్కడితో ఆగే అవకాశం లేకపోతే.. దిగువ ఉన్న మరో ఘాట్‌లోకి జారే ప్రమాదమూ లేకపోలేదు. చెట్టు బస్సును ఆపడం వల్ల.. మిగిలిన ప్రయాణికులంతా సురక్షితంగా బయట పడ్డారని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు.

ముఖ్యమంత్రి ఆదేశాలతో..

ప్రమాదం గురించి తెలుసుకున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రమాదం తీరు గురించి మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, పీడిక రాజన్నదొర, కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్‌లను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు వెంటనే మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు. వారి కుటుంబాలకు ధైర్యం చెప్పాలని సూచించారు. మృతుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా అందించాలని అధికారులను ఆదేశించారు. ప్రమాద విషయం తెలుసుకున్న పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ సీఎం ఆదేశాల మేరకు హుటాహుటిన బయలుదేరి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. ప్రమాదం తీరును తెలుసుకుని విచారం వ్యక్తం చేశారు. పాడేరు జిల్లా ఆస్పత్రికి చేరుకొని క్షతగాత్రులను పరామర్శించారు.



ఘాట్‌రోడ్డులో ప్రమాద ఘట్టం (ఊహా చిత్రం)

సహాయక చర్యలు ముమ్మరం

ప్రమాద విషయం తెలుసుకున్న కలెక్టర్ సుమిత్‌కుమార్, ఎస్పీ తుహిన్ సిన్హా ప్రమాద స్థలికి హుటాహుటిన చేరుకున్నారు. ప్రమాదం జరిగిన అరగంట వ్యవధిలోనే సహాయక చర్యలు ముమ్మరం చేశారు. లోయ పైనుంచి కొందరు.. కింద నుంచి కొందరు ప్రమాదానికి గురైన బస్సు వద్దకు చేరుకుని అతికష్టం మీద క్షతగాత్రులను ఘాట్‌రోడ్డు వద్దకు తీసుకొచ్చారు. ప్రభుత్వ అధికారులు వెంటనే స్పందించి సకాలంలో వారిని ఆస్పత్రికి తరలించారు. ఐదుగురు పరిస్థితి విషమంగా ఉండటంతో విశాఖలోని మెడికవర్ ఆస్పత్రికి తీసుకొచ్చి చికిత్స అందిస్తున్నారు. మిగిలిన వారంతా పాడేరు ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారు.

ఆ క్షణంలో నా బిడ్డను గట్టిగా పట్టుకున్నా..



విశాఖపట్నం నుంచి నాలుగు నెలల బిడ్డతో పాడేరుకు బయలుదేరాను. మరో అరగంటలో పాడేరులో దిగిపోతానని అనుకుంటున్న సమయంలో క్షణాల్లో బస్సు లోయలోకి దూసుకుపోవడంతో భయం వేసింది. నా బిడ్డను గట్టిగా పట్టుకుని అలాగే ఉండిపోయాను. నా తలకు గాయమైంది. నా బిడ్డకు ఏమీ కాలేదు. సంతోషంగా ఉంది.

– తాంగుల జ్యోతి, ప్రయాణికురాలు, తూటంగి, డుంబ్రిగుడ మండలం

ప్రాణం పోయిందనుకున్నా..



అనంతపురంలో ప్రకృతి వ్యవసాయంపై శిక్షణ పొంది సొంతూరుకు వచ్చేందుకు చోడవరంలో బస్సెక్కాను. ఘాట్‌లో మలుపు వద్ద ఒక్కసారిగా బస్సు పక్కకు రావడంతో కంగారు పడ్డాను. చూస్తుండగానే బస్సు నేరుగా లోయలోకి దూసుకుపోవడంతో ప్రాణం పోయిందనుకున్నాను. ఇంట్లో భార్యాపిల్లలను ఆ క్షణంలో గుర్తు చేసుకున్నాను. చెట్టు అడ్డంగా ఉండటంతో బస్సు నిలిచింది. గాయంతో ప్రమాదం నుంచి బయటపడ్డాను.

– బంటు రఘునాథ్, ఒంటిపాక గ్రామం, హుకుంపేట మండలం

క్షతగాత్రులకు పరామర్శ



మెడికవర్ ఆస్పత్రిలో క్షతగాత్రుడిని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు మత్స్యరాస వెంకటలక్ష్మి

సాక్షి, విశాఖపట్నం: పాడేరు ఘాట్ రోడ్ ప్రమాదంలో గాయాలపాలై మెడికవర్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి ఆదివారం రాత్రి పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షిస్తున్న ఎస్టీ సెల్ మెడికల్ ఆఫీసర్ మౌళి, చీఫ్ మెడికల్ ఆఫీసర్ నీలిమాలతో ప్రత్యేకంగా చర్చించారు. మెరుగైన వైద్యం అందించాలని సూచించారు. అధైర్య పడొద్దని ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

అమ్మో.. ఘాట్‌రోడ్డు

- పాడేరు ఘాట్‌రోడ్డులో తరచూ ప్రమాదాలు
- హెయిర్‌పిన్ బెండ్ మలుపు ప్రమాదాలకు పిలుపు



2021లో హెయిర్‌పిన్‌బెండ్ 5 మలుపు వద్ద బ్రేక్‌ఫెయిల్ కావడంతో లోయలోకి దూసుకుపోయిన ప్రైవేటు బస్సు (ఫైల్)

అనంతగిరి: మైదాన ప్రాంతం నుంచి ఏజెన్సీకి వెళ్లాలంటే దట్టమైన అడవి మీదుగా ఘాట్ రోడ్డులో ప్రయాణం చేయాలి. పాడేరు నుంచి మైదాన ప్రాంతానికి 23 కిలోమీటర్లు, అనంతగిరి నుంచి కాశీపట్నం వరకు 25 కిలో మీటర్ల మేర ఘాట్‌రోడ్డు విస్తరించి ఉంది. ఏజెన్సీ ప్రాంతానికి కీలకమైన ఘాట్ రోడ్డులో వరస ప్రమాదాలతో వాహనచోదకులు భయాందోళన చెందుతున్నారు. పాడేరు ఘాట్‌రోడ్డులో కోమాలమ్మ, పనుకు, వ్యూపాయింట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. అనంతగిరి ఘాట్‌రోడ్డులో ప్రమాదకరమైన హెయిర్ పిన్‌బెండ్ మలుపులు ఉన్నాయి.

పాడేరు ఘాట్‌రోడ్డులో..

- 2019 జూలై 8వ తేదీ అర్ధరాత్రి పాడేరు ఘాట్ రోడ్డులోని వంట్లమామిడి గ్రామ సమీపంలో ఓ ప్రైవేట్ బస్సు బ్రేక్ విఫలం కావడంతో బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ముగ్గురు మహిళలు మృతి చెందగా, 35 మంది గాయపడ్డారు. మృతులు, గాయపడిన ప్రయాణికులందరిదీ తూర్పుగోదావరి జిల్లా కాకినాడ. ప్రమాద సమయంలో బస్సులో 40 మంది ప్రయాణికులు ఉన్నారు. ఒడిశాలోని మజ్జి గౌరమ్మను దర్శించుకుని, తిరిగి కాకినాడకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది.
- 2021 నవంబర్ 13న వంతాపల్లి చెక్‌పోస్టు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 22 ఏళ్ల వివాహిత మృతి చెందగా.. ఆమె భర్తకు తీవ్ర గాయాలయ్యాయి.
- 2023 ఏప్రిల్ 26 రాత్రి పాడేరు– కోమాలమ్మ తల్లి ఘాట్ మలుపు వద్ద ఓ కారు అదుపు తప్పి రక్షణ గోడను ఢీకొట్టింది. అనంతరం లోయలోకి దూసుకుపోయింది. ఈ సంఘటనలో గాయపడిన మహేశ్వరితో పాటు కారు డ్రైవర్ కంద్రాపు ఉమామహేశ్వరరెడ్డి మృతి చెందారు. పాడేరులో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మహేశ్వరి భర్త సుబ్బారావు మరణించారు. భార్యాభర్తలిది విశాఖలోని సీతంపేట.
- 2023 ఏప్రిల్‌లో ఘాట్ రోడ్డు ఏసుక్రీస్తు విగ్రహం సమీపంలో మలుపు వద్ద కారు అదుపుతప్పి లోయలోకి దూసుకుపోయింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు నలుగురు మృతిచెందారు. మృతులందరిదీ ముంచంగిపుట్టు మండలం కిలగాడ.
- 2023 జూలై 11న పాడేరు ఘాట్‌రోడ్డులోని ద్విచక్రవాహనాన్ని ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో పరవాడ మండలం ముచ్చలమ్మపాలేనికి చెందిన సతీష్ మృతి చెందాడు. మోదకొండమ్మను దర్శించుకుని, తిరిగి ప్రయాణంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది.

అనంతగిరి ఘాట్‌రోడ్డులో..

- 2019లో హెయిర్ పిన్‌బెండ్ 2 మలుపు వద్ద మైదాన ప్రాంతానికి వెళుతున్న ప్రైవేటు బస్సు అదుపుతప్పి కొండను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 25 మంది వరకు పర్యాటకులు గాయపడ్డారు. బ్రేక్ ఫెయిల్ కావడంతో ప్రమాదం జరిగింది.
- 2021లో హెయిర్ పిన్‌బెండ్ 5 మలుపు వద్ద రాత్రి 8 గంటల సమయంలోని 80 అడుగుల లోయలోకి ప్రైవేట్ బస్సు బోల్తా పడింది. ఈ ఘటనలో నలుగురు మృతి చెందగా.. 22 మందికి గాయాలయ్యాయి. వీరంతా హైదరాబాద్‌కు చెందిన పర్యాటకులు.

విహారంలో విషాదం

- సీతపాలెం బీచ్‌లో విద్యార్థి మృతి
- రాళ్లపై ఉండి సెల్ఫీలు తీసుకుంటున్న ఆరుగురు
- బలమైన కెరటం ఢీకొని ఒకరి మృతి
- అపస్మారక స్థితిలో మరో మహిళ



సాయిరాం మృతదేహం



ప్రమాదం జరిగే ముందు తీసుకున్న ఫొటోలో సాయిరాం తదితరులు

రాంబిల్లి: అదొక ప్రమాదకర ప్రదేశం..గతంలోనూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకున్నాయి. అయితే ఎంతో ఆహ్లాదకరంగా, ప్రత్యేకంగా ఉండడంతో పర్యాటకులు ముచ్చటపడి ఆ ప్రాంతానికి వస్తుంటారు. ఇలా వచ్చిన ఓ పర్యాటక బృందం సెల్ఫీల సరదాలో పడింది. రాళ్ల, కెరటాల చెంత సరదాగా సెల్ఫీలు తీసుకుంటోంది. ఇంతలో బలమైన కెరటం దూసుకొచ్చింది..దాని ధాటికి ఒకరు సముద్రంలోకి కొట్టుకుపోగా, మరో మహిళను అపస్మారక స్థితిలోకి నెట్టింది. ఎస్ఐ దీనబంధు అందించిన వివరాలివి.

విశాఖపట్నం వన్ టౌన్ (పాత పోస్టాఫీస్), అల్లిపురం, సింహాచలంకు చెందిన ఏడుగురు ఆదివారం సీతపాలెం సమీపంలో గల ఉప్పుటేరు, బీచ్ ప్రాంతానికి విహార యాత్రకు వచ్చారు. పాత పోస్టాఫీస్‌కు చెందిన కొట్టోజు సాయిరాం(19), కొట్టోజు కావ్య(17), సింహాచలానికి చెందిన గన్నవరపు సాయి ప్రియాంక(27), గన్నవరం రవిశంకర్ (28), అల్లిపురానికి చెందిన కండిపిల్లి ఫణీంద్ర (25), కండిపల్లి సాయికిరణ్(28) రాళ్లపై నిలబడి సెల్ఫీలు దిగుతున్నారు. ఇంతలో బలమైన కెరటం వీరిని ఢీకొట్టింది. దీంతో సాయిరాం సముద్రంలో కొట్టుకుపోయాడు. కొంత సేపటికి సాయిరాం మృతదేహం సంఘటన జరిగిన ప్రాంతానికి కొంత దూరంలో తీరానికి కొట్టుకు వచ్చింది. ఈ ప్రమాదంలో సాయి ప్రియాంక గాయపడి కొట్టుకుపోతుండగా సహచరులు ఆమెను రక్షించారు. ఆమెను అనకాపల్లి ఉషా ప్రైమ్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. సాయిరాం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్‌టీఆర్ ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ దీనబంధు తెలిపారు.

ఇదిగో బలం!

- వైఎస్సార్ సీపీకి పట్టం కట్టిన పల్లెలు
- జీర్ణించుకోలేకపోతున్న టీడీపీ, పచ్చ పత్రికలు
- ప్రజలను తప్పుదారి పట్టించేలా రాతలు
- ఉప ఎన్నికల్లో తమకే ఎక్కువ సీట్లొచ్చాయని తప్పుడు ప్రచారం

సాక్షి, విశాఖపట్నం: ఇప్పటికే పల్లెలు, పట్టణాలు, నగరాలు అన్న తేడా లేకుండా వైఎస్సార్ సీపీకి ప్రజలు పట్టం కట్టారు. తాజాగా సర్పంచ్, వార్డులకు జరిగిన ఉప ఎన్నికల్లోనూ అదే రీతిలో తీర్పునిచ్చారు. అత్యధిక స్థానాలు అధికార వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లకే కట్టబెట్టారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సుపరిపాలనకే జై కొట్టినట్టు మరోసారి నిరూపించారు. అయితే ఈ ఫలితాలను జీర్ణించుకోలేని తెలుగుదేశం, ఆ పార్టీకి కొమ్ముకాస్తున్న పచ్చ పత్రికలు ఈ ఉప ఎన్నికల్లో టీడీపీకే ఎక్కువ స్థానాలొచ్చాయంటూ ప్రజలను తప్పుదారి పట్టించేలా రాతలు రాస్తున్నారు. వాస్తవ పరిస్థితులకు భిన్నంగా పల్లెల్లో తాము మునుపటికంటే పుంజుకున్నట్టు జనాన్ని నమ్మించేలా తప్పుడు ప్రచారం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ మద్దతుతో గెలిచిన సర్పంచ్, వార్డు సభ్యుల స్థానాలను తమ ఖాతాలోనే నిస్సిగ్గుగా వేసుకునేందుకు నానా తంటాలు పడుతున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని ప్రజలు ఎంతగా ఆదరిస్తున్నారో ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలో జరిగిన ఉప ఎన్నికల్లో వచ్చిన ఫలితాలే నిదర్శనంగా నిలుస్తున్నాయి. విశాఖపట్నం జిల్లాలో ఏకైక (భీమిలి మండలం లక్ష్మీపురం) సర్పంచ్ సహా మరో తొమ్మిది వార్డు స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ మద్దతుదార్లే గెలుపొందారు.

ఈ జిల్లాలో ఒక్క చోట కూడా టీడీపీ గాని, ఆ పార్టీకి మద్దతుగా నిలిచే బీజేపీ, జనసేనలు బలపరచిన అభ్యర్థులు గాని గెలవలేదంటే పరిస్థితిని అర్థం చేసుకోవచ్చు. ఇక అనకాపల్లి జిల్లాలో 24 వార్డు స్థానాల్లో 16 వైఎస్సార్‌సీపీ, ఐదు టీడీపీ, మూడు ఇతరులకు దక్కాయి. ఈ జిల్లాలో రెండు సర్పంచ్ స్థానాలకు గాను కొరుప్రోలు సర్పంచ్ స్థానాన్ని టీడీపీ దక్కించుకుంది. బుచ్చయ్యపేటలో సర్పంచ్ (టీడీపీ) మరణించడంతో బరిలో నిలిచిన అతని భార్యపై సానుభూతితో వైఎస్సార్‌సీపీ నాయకులు పోటీకి దింపలేదు. దీంతో అక్కడ సర్పంచ్ స్థానం ఏకగ్రీవమైంది.

అల్లూరి సీతారామరాజు జిల్లాలో నాలుగు సర్పంచ్ స్థానాల్లో మూడింటిని (రంపచోడవరం మండలం ఆకూరు, జీకేవీధి మండలం సీలేరు, పెదబయలు మండలం పెదకోడపల్లి) వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థులే విజయం సాధించారు. హుకుంపేట మండలం శోభకోట సర్పంచ్ స్థానాన్ని మాత్రమే టీడీపీ మద్దతు అభ్యర్థి గెలవగలిగారు. వాస్తవ ఫలితాలు ఇలా ఉంటే టీడీపీ నేతలు మాత్రం కిందపడ్డా తమదే గెలుపంటూ అడ్డగోలు వాదనలకు దిగుతున్నారు. ఆ పార్టీ తోక పత్రికలు అవాస్తవాలు రాస్తూ ప్రజలను తప్పుదారి పట్టించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాయి. జనం వీరి రోత రాతలను చూసి విస్తుపోతున్నారు.



బూసిపుట్టులో ఏకగ్రీవమైన వార్డు మెంబర్లతో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

విశాఖ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల ఉప ఎన్నికల వివరాలు

	మొత్తం	వైఎస్సార్‌సీపీ	టీడీపీ	ఇతరులు
విశాఖ జిల్లా..				
సర్పంచ్‌లు	1	1	0	0
వార్డులు	9	9	0	0
అనకాపల్లి జిల్లా..				
వార్డులు	24	16	5	3
అల్లూరి జిల్లా..				
సర్పంచ్‌లు	4	3	1	0
వార్డులు	57	35	14	8

క్లుప్తంగా

ఉప్పవరం వద్ద బస్సు, బైక్ ఢీ

ఐదుగురికి గాయాలు



ఉప్పవరం పిల్లాలమ్మ గుడి వద్ద ఢీకొన్న బైక్-బస్సు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని ఉప్పవరం వద్ద ఆదివారం సాయంత్రం రోడ్డు ప్రమాదం జరిగింది. బస్సు, బైక్ ఢీకొనడంతో ఐదుగురు గాయపడ్డారు. మల్లవరంకు చెందిన గీపాల మణి గాయపడింది. పెళ్లి చూపుల భోజనాల నిమిత్తం చూచుకొండకు వచ్చిన దేశపాత్రుని పాలేనికి చెందిన మరో నలుగురికి గాయాలయ్యాయి. వారిని అనకాపల్లి ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స నిమిత్తం చేర్చారు. పిల్లాలమ్మ గుడి వద్ద ఈ ప్రమాదం జరిగింది.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

గొలుగొండ: రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. మండలంలోని కొత్తమల్లంపేటకు చెందిన గుడివాడ అప్పలనాయుడు(36), భార్య జానకితో కలసి ఆదివారం కోటవురట్ల మండలం గ్రామ పరిధిలో ఉన్న పట్టాలమ్మతల్లి గుడి వద్దకు బైక్‌పై వెళ్లి వస్తుండగా గొలుగొండ గ్రామ సమీపంలో వెంకటాపురం వద్ద రోడ్డు ప్రమాదానికి గురయ్యారు. ఈ ఘటనలో అప్పలనాయుడు తలకు బలమైన గాయం కారణంగా ప్రమాద స్థలంలోనే మృతిచెందాడు. అతని భార్య జానకికి కూడా గాయాలయ్యాయి. విషయం తెలిసిన వెంటనే గొలుగొండ ఎస్‌ఐ నారాయణరావు ప్రమాద స్థలం వద్దకు చేరుకొని అప్పలనాయుడు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

భవనంపై నుంచి జారిపడి మహిళ మృతి

మద్రిపాలెం : ప్రమాదవశాత్తు భవనంపై నుంచి జారిపడి ఓ మహిళ మృతి చెందింది. తందాన గద్దేష్ అతని భార్య రమణమ్మ ఇద్దరూ కంచరపాలెం దరి తోట వీధిలో కూలి పనులు చేసుకుంటూ నివసిస్తున్నారు. తుమ్మిడి వీధిలో శ్రీనివాసరావు అనే కాంట్రాక్టర్ వద్ద బిల్డింగ్ పనులు చేస్తున్నారు. భర్త బిల్డింగ్ పైన పని చేస్తుండగా భార్య రమణమ్మ (38) కింద నుంచి మీదకు సామగ్రి తీసుకెళ్తుండగా కిందికి పడిపోయారు. వెంటనే కేజీహెచ్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఎస్‌ఐ రవికిషోర్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బడుగులకు నాణ్యమైన విద్య జగనన్న ఘనతే

- రాష్ట్రంలో ఎస్సీ వర్గానికి పెద్దపీట
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు జూపూడి ప్రభాకరరావు



సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు. చిత్రంలో బొడ్డేడ ప్రసాద్, లోచల సుజాత

అనకాపల్లిటౌన్: విద్యా వ్యవస్థలో సమూల మార్పులు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ అధ్యక్షుడు, ప్రభుత్వ సామాజిక న్యాయ సలహాదారు జూపూడి ప్రభాకరరావు అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులో మంత్రి గుడివాడ అమర్‌నాథ్ కార్యాలయంలో జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత అధ్యక్షతన ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తమ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్దపీట వేస్తుంటే ప్రతిపక్షాలు ఓర్వలేక లేనిపోని విమర్శలు చేయడం సరికాదన్నారు. విద్య మార్పుతో బడుగు, బలహీనవర్గాల నాణ్యత గల విద్య అందుతుంటే చంద్రబాబునాయుడు జీర్ణించుకోలేకపోతున్నారని విమర్శించారు. తెలుగు, ఆంగ్ల మాధ్యమాలను ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో అమలు చేస్తుంటే సహకరించాల్సింది పోయి ప్రభుత్వంపై బురదజల్లే ధోరణి అవలంభించడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. ఎస్సీ వర్గానికి రాష్ట్రంలో పెద్దపీట వేసింది ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డేనని అన్నారు. రానున్న సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి సీఎంగా జగన్‌ను గెలిపించుకునే బాధ్యత మనందరిపై ఉందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు, లోకేష్, దత్తపుత్రుడు పవన్‌కళ్యాణ్‌లు ఎక్కడ తిరిగినా ప్రజలంతా జగన్ వెంటే ఉన్నారని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా పేదల కోసం 32 లక్షల గృహాలు నిర్మించి ఇచ్చిన ఘనత జగనన్న ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. అరకిలోమీటర్ కూడా తిరగలేని పవన్ కళ్యాణ్‌కు ప్రజా సమస్యలు ఎలా తెలుస్తాయని ప్రశ్నించారు. ప్రజా సంకల్పయాత్రలో జగన్‌మోహన్ రెడ్డి కాలినడకన రాష్ట్రమంతా తిరిగి ప్రజల కష్టాలను కళ్లారా చూసి సీఎంగా గెలిచిన తర్వాత సంక్షేమాభివృద్ధి అంటే ఇలా ఉంటుందని చేసి చూపారని తెలిపారు. దళితదండు అంతా జగన్ వెంటే ఉంటూ, ఆయన గెలుపుకోసం పాడుతామన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ మాట్లాడుతూ ఏపీలో అంబేడ్కర్ రాజ్యాంగాన్ని అమలు చేసింది ఒక్క సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. దళితవర్గానికి ఒక ఉప ముఖ్యమంత్రి, నలుగురు ఎమ్మెల్యే పదవులు కేటాయించడమే ఉదాహరణగా అభివర్ణించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో జిల్లాలో అన్ని మేజర్ పంచాయతీలు ఎస్సీ వర్గానికి కేటాయించిన ఘనత తమ ప్రభుత్వానిదేనన్నారు. జిల్లాలో ఇటీవల జరిగిన పంచాయతీల్లో 64 పంచాయతీలకుగాను 53 పంచాయతీలను వైఎస్సార్‌సీపీ కైవసం చేసుకోవడం ప్రభుత్వంపై ప్రజలకున్న నమ్మకానికి నిదర్శనమన్నారు. జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా కోటి 70 లక్షల జనాభాగల ఎస్సీ వర్గానికి రూ.53.66 కోట్ల సంక్షేమ పథకాలు అమలు చేసింది జగన్ ప్రభుత్వమేనని అన్నారు. అంతకుముందు అంబేడ్కర్ చిత్రపటానికి జూపూడి ప్రభాకరరావు, బొడ్డేడ ప్రసాద్, లోచల సుజాత పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ జోన్ ఇన్‌ఛార్జి అల్లంపల్లి రాజుబాబు, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సరేష్, ఎస్సీసెల్ జిల్లా నాయకులు జామి రాజు, వద్దాది అశోక్, మందా రాము, అమ్మాజీ, కె.పద్మ, మూనూరు శ్రీనివాసరావు, డీవీ.నర్సింహారావు, సంపంగి కనకరావు, బెల్లాన అనురాధ, సర్పంచ్‌లు తట్టా పెంటయ్యనాయుడు, సప్పారపు లక్ష్మీప్రసన్న పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్ పాల్గొన్నారు.

గత స్మృతులకు చిహ్నాలు ఛాయాచిత్రాలు

మంత్రి గుడివాడ అమర్‌నాథ్



ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి గుడివాడ అమర్‌నాథ్

ఏయూక్యాంపస్ : జీవితంలో మరుపురాని సన్నివేశాలను, గత స్మృతులను గుర్తుకు తెచ్చేవి ఛాయాచిత్రాలేనని మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని పురస్కరించుకుని వైజాగ్ ఫొటో జర్నలిస్టు అసోసియేషన్ ఆధ్వర్యంలో బీచ్‌రోడ్డులోని విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ప్రదర్శనను మంత్రి అమర్‌నాథ్ ఆదివారం సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశాఖకు చెందిన ఫొటో జర్నలిస్టులు రాష్ట్రస్థాయి, జాతీయ స్థాయి అవార్డులను గెలుచుకోవడం మనందరికీ గర్వకారణం అని అన్నారు. ఈ సందర్భంగా ఫొటోగ్రఫీలో అవార్డు సాధించిన వారిని మంత్రి అమర్‌నాథ్ సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైజాగ్ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షులు పీవీఎస్ మూర్తి, కార్యదర్శి జి.తిరుపతిరావు, అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

పొత్తులు మా ముందు చిత్తు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఉన్న ప్రతిపక్ష పార్టీలన్నీ వచ్చినా..మా ముందు చిత్తు కాక తప్పదని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. ఆదివారం ఫొటోగ్రఫీడే సందర్భంగా విశాఖ మ్యూజియంలో ఏర్పాటు చేసిన ఫొటో ప్రదర్శన అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడారు. స్థానిక ఉప ఎన్నికల్లో మెజార్టీ స్థానాలను వైఎస్సార్ సీపీ కైవసం చేసుకున్నప్పటికీ..టీడీపీ అభ్యర్థులే ఘనవిజయాన్ని సాధించినట్లు కొన్ని పత్రికలు ప్రచారం చేసుకుంటున్నాయన్నారు. అప్పుడప్పుడు గెలిచే పార్టీలు ఇలాగే వార్తలు రాయించుకుంటూ సంబరాలు చేసుకుంటూ ఉంటాయని, వారి ఆనందాన్ని మేము ఎందుకు కాదంటామని మంత్రి అన్నారు. గల్లీ క్రికెట్లో గెలిచిన ఆటగాళ్లు వరల్డ్ కప్ కొట్టామంటే ఏ విధంగా ఉంటుందో తెలుగుదేశం పార్టీ తీరు కూడా అలాగే ఉందని ఆయన వ్యాఖ్యానించారు. 2020లో పంచాయతీలు, 2021 లో ఎంపీటీసీలు, జెడ్పీటీసీలను మా పార్టీ పూర్తిస్థాయిలో గెలుచుకున్న విషయాన్ని మంత్రి గుర్తు చేశారు. గత ఎన్నికల్లో కొడుకును కూడా గెలిపించుకోలేని చంద్రబాబు పొత్తుల కోసం వెంపర్లాడుతున్నాడని అన్నారు. జనసేన, టీడీపీ కలిసి పోటీ చేస్తాయన్న విషయాన్ని ఏడాది కిందటి నుంచే తాము చెబుతున్నామని.. ఇప్పటికి వారి మధ్య ఉన్న బంధం బయటపడిందన్నారు. మరొక ఎనిమిది నెలల్లో సాధారణ ఎన్నికలు రాబోతున్నాయని 2019 ఎన్నికల ఫలితాలు పునరావృతం అవుతాయని ఇందులో ఎవరికి ఎటువంటి అనుమానాలు అవసరం లేదని మంత్రి అమర్‌నాథ్ స్పష్టం చేశారు.

అయ్యన్న అబద్ధాల కోరు

- నర్సీపట్నం–కృష్ణదేవిపేట రోడ్డు విస్తరణ పనులు మేం చేస్తుంటే.. అయ్యన్న అబద్ధాలాడుతున్నారు
- నర్సీపట్నం ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్



రోడ్డు పనులు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గణేష్

గొలుగొండ: ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డిని చూసి ఓర్వలేక మాజీ మంత్రి అయ్యన్నపాత్రుడు లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ అన్నారు. మండల నాయకుల ఆధ్వర్యంలో ఆదివారం అరిల్లోవ అటవీ ప్రాంతంలో జరుగుతున్న రోడ్డు పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో రూ. 19 కోట్ల మేర నిధులు మంజూరు చేసి నర్సీపట్నం–కృష్ణదేవిపేట రోడ్డు విస్తరణ పనులు చేశామని, ఈ విషయం అయ్యన్నపాత్రుడు గుర్తు చేసుకోవాలని తెలిపారు.

అరిల్లోవ అటవీ ప్రాంతంలో రోడ్డు విస్తరణకు అడ్డంకులుండగా రెండున్నరేళ్లలో ఈ అడ్డంకులు పూర్తి చేసి రోడ్డు పనులు దాదాపుగా పూర్తి చేశామన్నారు. 40 సంవత్సరాల రాజకీయ అనుభవం అని చెప్పుకుంటున్న అయ్యన్న ప్రజలకు చేసిందేమీ లేదు కాబట్టే ప్రజలు ఆయనను ఇంటికే పరిమితం చేశారన్నారు. ఈ రోడ్డు విస్తరణ పనులకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి రూ. 19 కోట్ల నిధులు మంజూరు చేస్తే ఈ నిధులు టీడీపీ పాలనలో వచ్చాయని ఆ పార్టీ నేతలు గొప్పలు చెప్పుకోవటం ప్రజలు గమనిస్తున్నారని అన్నారు. పనులు పూర్తి చేస్తున్న సందర్భంగా తమ ప్రభుత్వానికే సంబరాలు చేసుకునే అర్హత ఉందని ఎమ్మెల్యే గణేష్ తెలిపారు. నెల రోజుల్లో ఈ రోడ్డు పనులు పూర్తి చేసి ప్రజలకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో నర్సీపట్నం మార్కెట్ యార్డు చైర్మన్ చిటికెల భాస్కరనాయుడు, జడ్పీటీసీ సభ్యుడు సుర్ల గిరిబాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండల అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, యూత్ పార్టీ అధ్యక్షుడు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జీ, చోద్యం సహకార బ్యాంక్ చైర్మన్ పెద్దిరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలిక దుర్మరణం

కొంకోట: విద్యుదాఘాతంతో 11 ఏళ్ల బాలిక ఆదివారం దుర్మరణం చెందింది. విషాదకరమైన ఈ సంఘటన పేరంటాలపాలెం శివారు జోగారావుపేటలో జరిగింది. ఇందుకు సంబంధించి ఏఎస్‌ఐ పీడీ సుందరమ్మ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని జోగారావుపేట గ్రామంలో కొత్తపల్లి నూకరాజుకు సిరి (11), మాధురి అనే ఇద్దరు కుమార్తెలున్నారు. వీరు తమ ఇంటికి సమీపంలో ఉన్న పొలంలో పశువుల శాల వద్దకు వెళ్లారు. అక్కడ ఉన్న ఆవుకు తాగడానికి నీరు లేకపోవడంతో పెద్ద కుమార్తె సిరి ప్లగ్ బాక్స్‌లో వైరు పెట్టగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై కింద పడిపోయింది. ఈ విషయం గ్రహించిన చిన్న అమ్మాయి మాధురి కేకలు వేయడంతో సమీపంలోని పొలంలో ఉన్న పెదనాన్న నాగేశ్వరరావు వచ్చి విద్యుత్ లైన్ ఆపి పరిశీలించగా సిరి కొన ఊపిరితో ఉంది. దీంతో ఆమెను అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తీసుకెళ్లగా అక్కడ వైద్యులు తనిఖీ చేసి అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ఈ మేరకు తండ్రి నూకరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ సుందరమ్మ తెలిపారు. మృతురాలు సిరి జోగారావుపేట ప్రాథమిక పాఠశాలలో 5వ తరగతి చదువుతోంది. తండ్రి నూకరాజు ఆటో డ్రైవర్. తల్లి అన్నపూర్ణ గృహిణి. చిన్నతనంలోనే ప్రమాదంలో సిరి మృత్యు ఒడిలోకి చేరడంతో కుటుంబం విషాద సాగరంలో మునిగిపోయింది.

సీఎం జగన్‌పై ప్రజల్లో చెక్కుచెదరని ఆదరణ

- ఉప ఎన్నికల ఫలితాలే దీనికి నిదర్శనం
- సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డి సీఎం కావడం తథ్యం
- వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్



మునగపాక: రాష్ట్రవ్యాప్తంగా జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయం సాధించి ప్రభంజనం సృష్టించారని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకున్న నమ్మకమే ఈ విజయానికి ఉదాహరణ అన్నారు. ఆదివారం ఆయన మునగపాకలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి ఒకవైపు సంక్షేమం, మరో వైపు అభివృద్ధి పరవళ్లు తొక్కుతున్నాయన్నారు.

ప్రజలంతా జగన్‌మోహన్‌రెడ్డి నాయకత్వాన్ని మరలా కోరుకుంటున్నారన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందించడంతో పాటు అర్హులై ఉండి ఇంత వరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి సేవ అందుకోలేని వారి కోసం ఇటీవల జగనన్న సురక్ష కార్యక్రమం ఏర్పాటు చేసి 11 రకాల సేవలు అందించిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. సచివాలయ, వలంటీర్ వ్యవస్థలు అందుబాటులోకి వచ్చాక ప్రజలకు సకాలంలో మెరుగైన సేవలందుతున్నాయన్నారు. ఎన్నికల ముందు ప్రజలకు ఇచ్చిన హామీలతో పాటు పలు పథకాలు అందుబాటులోకి తీసుకురావడం ద్వారా ప్రజాభిమానాన్ని మరింత పెంచుకోగలిగారన్నారు. ఇటువంటి పాలనను మెచ్చిన ప్రజలు శనివారం జరిగిన పంచాయతీ ఉప ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ మద్దతుదారులకు పట్టం కట్టారన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు. దేశంలోనే ఆదర్శ ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డి పేరు గాంచారన్నారు. అనకాపల్లి జిల్లాలో 7 వార్డు సభ్యులకు ఎన్నికలు జరిగితే 5 స్థానాల్లో వైఎస్సార్‌సీపీ మద్దతుదారులు విజయకేతనం ఎగురవేశారన్నారు. ప్రజల్లో రోజురోజుకూ జగన్‌మోహన్‌రెడ్డిపై మరింత నమ్మకం పెరుగుతుందనడానికి ఈ ఫలితాలే నిదర్శమన్నారు. ప్రతిపక్ష పార్టీలు జగన్‌మోహన్‌రెడ్డిపై బురద జల్లేందుకు కుతంత్రాలు పన్నుతున్నా ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు ఎన్ని పార్టీలు కలిసి వచ్చినా రానున్న సార్వత్రిక ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి సీఎం కావడం తథ్యమని, అనకాపల్లి జిల్లాలో అన్ని స్థానాల్లోనూ వైఎస్సార్‌సీపీ జెండాలు రెపరెపలాడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

అల్లూరి స్ఫూర్తితో ఉద్యమ పోరు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ



అల్లూరి సమాధులకు నివాళులు అర్పిస్తున్న రామకృష్ణ, సీపీఐ నాయకులు



బ్రిటిష్ సైనికాధికారుల సమాధులను పరిశీలిస్తున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

గొలుగొండ: మన్యం వీరుడు అల్లూరి స్ఫూర్తితో బడుగు, బలహీన వర్గాల ప్రజల అభివృద్ధికి పాటుపడతామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ తెలిపారు. ఆయన ఆదివారం అనకాపల్లి జిల్లా పరిధిలో ఏఎల్ పురం గ్రామంలో ఉన్న అల్లూరి సమాధులకు పూలమాలలతో నివాళులు అర్పించి బస్సుయాత్ర ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సీపీఐ కార్యదర్శి రామకృష్ణ మాట్లాడుతూ 'రాష్ట్రాన్ని రక్షించండి–దేశాన్ని కాపాడండి' అనే నినాదంలో ఈనెల 17 నుంచి రాష్ట్రంలో ఉన్న అన్ని జిల్లాల్లో ఈ యాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. విప్లవ భావాలతో దేశ ప్రజలను కాపాడిన అల్లూరిని ఆదర్శంగా తీసుకొని ఈ జిల్లా పరిధిలో అల్లూరి పార్కు నుంచి యాత్ర చేయడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర సీపీఐ సహాయ కార్యదర్శి జె.వి. సత్యనారాయణమూర్తి, జిల్లా కార్యదర్శి బాలేపల్లి వెంకట రమణ, జిల్లా కార్యవర్గ సభ్యుడు రామునాయుడు పాల్గొన్నారు.

హైవర్టు, కవర్టు సమాధుల సందర్శన

నర్సీపట్నం: అల్లూరి చేతిలో హతమైన బ్రిటిష్ సైనికాధికారులైన హైవర్టు, కవర్టు సమాధులను సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ, పార్టీ నాయకులతో కలిసి ఆదివారం సందర్శించారు. సైనికాధికారుల సమాధులను పరిరక్షించాలని, కబ్జాలో ఉన్న 46 సెంట్ల స్థలాన్ని స్వాధీనం చేసుకోవాలని అన్నారు. ఆయన వెంట పలువురు సీపీఐ నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహస్వామి ఆలయ నిర్మాణానికి చర్యలు



ఆలయ నిర్మాణానికి రూ. లక్ష విరాళం అందిస్తున్న సన్యాసిపాత్రుడు

నాతవరం: ఈరుడి కొండపై శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం నిర్మించి దివంగత వైఎస్సార్ సీపీ నేత అంకంరెడ్డి జమీలు ఆశయం నెరవేర్చాలని నర్సీపట్నం మున్సిపాలిటీ మాజీ వైస్ చైర్మన్ చింతకాయల సన్యాసిపాత్రుడు అన్నారు. ఆలయ ప్రాంగణంలో ఆదివారం ఆలయ కమిటీ సభ్యులకు చింతకాయల సన్యాసిపాత్రుడు సొంత నిధులు లక్ష రూపాయలు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాతవరం సమీపంలో భారీ ఆలయం నిర్మించాలని దివంగత నేత జమీలు అనుకున్నారన్నారు. అయితే పనులు పూర్తి కాకుండానే ఆయన అనారోగ్యంతో మరణించడం బాధాకరమన్నారు. అందరి సహకారంతో ఆలయం పూర్తి చేస్తేనే జమీలు ఆశయం నెరవేరుతుందన్నారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందిస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని రెండో సారి సీఎంని చేసుకోవాలని ప్రజలు ఆసక్తి చూపిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాతవరం పంచాయతీ ఉప సర్పంచ్ కరక అప్పలరాజు, వ్యవసాయ సలహా మండలి చైర్మన్ శెట్టి నూకరాజు, వైఎస్సార్‌సీపీ సేవాదళ్ మండల శాఖ అధ్యక్షుడు గవిరెడ్డి కృష్ణంరాజు, హైస్కూల్ కమిటీ మాజీ చైర్మన్ రెడ్డి వరహాలబాబు, వైఎస్సార్‌సీపీ నాతవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు శెట్టి లచ్చబాబు, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, రామునాయుడు, పోలిరెడ్డి రాజు, అరవ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

బెడిసికొట్టిన మావోల వ్యూహం

- దండకారణ్యంలో భారీగా బూబీ ట్రాప్‌లు
- పోలీసులే లక్ష్యంగా పాతర
- ఎన్నికల వేళ విధ్వంసానికి యత్నం
- స్వాధీనం చేసుకున్న ఆంధ్రా పోలీసులు





అటవీప్రాంతంలో మావోలు అమర్చిన బూబీ ట్రాప్, పోలీసులు స్వాధీనం చేసుకున్న బూబీ ట్రాప్‌లు

చింతూరు: ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ సరిహద్దులో మావోయిస్టుల వ్యూహం బెడిసికొట్టింది. ఛత్తీస్‌గఢ్ అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో పోలీసులే లక్ష్యంగా ఈ ప్రాంతంలోని దట్టమైన దండకారణ్యంలో అమర్చిన ఏడు బూబీ ట్రాప్‌లను ఆంధ్రా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రధానంగా చింతూరు మండలం మల్లంపేటకు సమీపంలోనే ఇరు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతముంది. సరిహద్దుకు అవతల ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం సుక్మా జిల్లాలోని మైతా, దుర్‌మా, సింగారం వంటి మావోయిస్టు ప్రభావిత గ్రామాలున్నాయి. ఈ ప్రాంతం నుంచే మావోయిస్టులు ఇరు రాష్ట్రాల్లో తమ కార్యకలాపాలు కొనసాగిస్తుంటారు. దీంతో పోలీసులు సైతం ఇదే ప్రాంతంలో ప్రత్యేక బలగాలతో నిరంతరం కూంబింగ్ నిర్వహిస్తుంటారు. గతంలోనూ పోలీసులు, మావోయిస్టులకు నడుమ భారీ ఎన్‌కౌంటర్లు చోటు చేసుకోగా, ఇరువైపులా భారీగా ప్రాణనష్టం సంభవించింది.

బూబీ ట్రాప్ అంటే...

రహదారిపై రెండు నుంచి ఐదడుగుల లోతున గోతులు తవ్వి వాటిలో సూదిగా ఉండే ఇనుప ముక్కలు లేదా సూదిగా ఉండే వెదురు కర్రలను అమర్చడాన్ని బూబీ ట్రాప్ అంటారు. నిత్యం కూంబింగ్‌కు వచ్చే పోలీసులను లక్ష్యంగా చేసుకుని మావోయిస్టులు దండకారణ్యంలో బూబీ ట్రాప్‌లను అమర్చడం పరిపాటి. గతంలోనూ ఇదే ప్రాంతంలో మావోయిస్టులు వాటిని అమర్చిన ఘటనలున్నాయి. కూంబింగ్‌కు పోలీసులు అదే రహదారిలో వస్తారనే పక్కా సమాచారంతో మావోయిస్టులు పలుచోట్ల రహదారి పక్కనే గోతులను తీసి వాటిలో బూబీ ట్రాప్‌లను అమరుస్తారు. అనంతరం ఆ గోతులను కనబడకుండా చెత్తతో కప్పేస్తారు.

ఆదమరిచి అడుగేస్తే అంతే...

రహదారిపై మావోయిస్టులు మందుపాతర్లు అమర్చే అవకాశముండటంతో కూంబింగ్ నిర్వహించే పోలీసులు అధికశాతం రహదారి పక్కనే నడుస్తారు. అందుకే మావోయిస్టులు బూబీ ట్రాప్‌లను రహదారి పక్కనే అమరుస్తారు. అటుగా వచ్చిన వాటిని గమనించక ఆ గోతుల్లో పడితే వారి కాళ్లు, శరీరంలోకి సూదిగా ఉన్న బూబీ ట్రాప్‌లు గుచ్చుకుని తీవ్రమైన గాయాలు లేదా ప్రాణాలు పోయే అవకాశముంది. గతంలో బూబీ ట్రాప్‌ల వలలో చిక్కుకుని చాలామంది పోలీసులకు గాయాలైన సంఘటనలున్నాయి.

ఛత్తీస్‌గఢ్ ఎన్నికలే లక్ష్యంగా...

కొంతకాలంగా దండకారణ్యంలో మావోయిస్టులు ఎన్నికలను బహిష్కరిస్తూ వస్తున్నారు. తాజాగా ఛత్తీస్‌గఢ్‌లో ఈ ఏడాది నవంబరులో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ ఎన్నికల సందర్భంగా దండకారణ్యంలో ఆంధ్రా, ఛత్తీస్‌గఢ్ పోలీసులు విస్తృతంగా కూంబింగ్ నిర్వహించే అవకాశముంది. దీంతో కూంబింగ్‌కు వచ్చే బలగాలకు నష్టం చేకూర్చాలనే వ్యూహంలో భాగంగా తాజాగా సరిహద్దుల్లో మావోయిస్టులు అమర్చిన ఏడు బూబీ ట్రాప్‌లను పక్కా సమాచారంతో ఆంధ్రా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. మావోయిస్టుల బూబీ ట్రాప్‌ల వ్యూహాన్ని ఆదిలోనే అడ్డుకోవడం ద్వారా కూంబింగ్ బలగాలకు పెనుప్రమాదం తప్పినట్లయిందని పోలీసులు తెలిపారు.

పట్టు సాధించేందుకే... : ఎస్పీ తుహీన్‌సిన్హా

పోలీసులకు నష్టం చేకూర్చడం ద్వారా అటవీ ప్రాంతంలో తిరిగి పట్టు సాధించేందుకు మావోయిస్టులు ప్రయత్నిస్తున్నారని, దీనిలో భాగంగానే బూబీ ట్రాప్‌లను అమర్చారని ఎస్పీ తుహీన్‌సిన్హా అన్నారు. బూబీ ట్రాప్‌లను అమర్చి పోలీసులను హతమార్చేందుకు మావోయిస్టులు ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని, దీనివల్ల అటవీ ప్రాంతాల్లో నివసించే గిరిజనులకూ నష్టం జరిగే అవకాశముందని ఆయన తెలిపారు. గిరిజనుల అభివృద్ధికి తోడ్పడుతున్న పోలీసులు, అధికారులను అడ్డుకునేందుకే వారు ఇలాంటి చర్యలు చేపడుతున్నారన్నారు.

క్లుప్తంగా

క్రికెట్ కిట్ల పంపిణీ


క్రీడాకారులకు క్రికెట్ కిట్‌లు అందిస్తున్న చందు

మునగపాక: క్రీడల ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరక దారుఢ్యం పెరుగుతుందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కాండ్రేగుల చందు తెలిపారు. మండలంలోని గొల్లలపాలెం పంచాయతీ పరిధిలోని యువతకు ఆయన ఆదివారం క్రికెట్ కిట్‌లు అందజేశారు. ఈ సందర్భంగా చందు మాట్లాడుతూ క్రీడల్లో రాణించడం ద్వారా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరుగుతాయన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రతిభ కలిగిన క్రీడాకారులున్నారని, వారిని ప్రతి ఒక్కరూ ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో జేఎల్‌పీ యూత్ సభ్యులు పాల్గొన్నారు.

చురుగ్గా ఓటరు సర్వే


ఓటరు సర్వే చేస్తున్న బీఎల్వోలు

మునగపాక: మండల వ్యాప్తంగా ఓటరు సర్వే చురుగ్గా సాగుతోంది. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు గ్రామాల్లో సమగ్ర ఓటరు సర్వేను పకడ్బందీగా నిర్వహిస్తున్నారు. బీఎల్వోలు ఇంటింటికీ తిరిగి ఓటరు జాబితాల్లో సవరణలు, తొలగింపులపై వివరాలు సేకరిస్తున్నారు. కొత్తగా ఓటరు నమోదుకోసం దరఖాస్తులు అందిస్తున్నారు.

శ్మశాన వాటిక అభివృద్ధికి కృషి


గవర్ల అనకాపల్లి శ్మశాన వాటికను పరిశీలిస్తున్న నాయకులు

మునగపాక: గవర్ల అనకాపల్లి శ్మశానవాటిక అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని తోటాడ సర్పంచ్ దొడ్డి మంగవేణి భర్త కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని తోటాడ శివారు గవర్ల అనకాపల్లిలోని శ్మశాన వాటికను స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్మశానవాటికలో దహన సంస్కారాలకు అవసరమయ్యే ఏర్పాట్లు, మొక్కలు నాటేందుకు కృషి చేస్తామన్నారు. ఆయన వెంట స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్ ఇస్మాయిల్, సచివాలయ కార్యదర్శి కాండ్రేగుల లక్ష్మీనారాయణ, ఇంజినీరింగ్ అసిస్టెంట్ రాము తదితరులున్నారు.

అనకాపల్లి సినిమాలు

బేబి	:	రాజా
పిజ్జా	:	సత్యనారాయణ స్క్రీన్-1
డీడీ రిటర్న్స్ భూతాల బంగ్లా	:	సత్యనారాయణ స్క్రీన్-2
జైలర్	:	షిర్డిసాయి
భోళాశంకర్	:	పర్తిసాయి
భోళాశంకర్	:	వెంకటేశ్వర
మిస్టర్ ప్రెగ్నెంట్	:	శ్రీసత్య
బ్రో	:	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 23 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-2 యూనిట్లు, బీ పాజిటివ్-8 యూనిట్లు, ఓ పాజిటివ్-13 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా ఆదివారం 147 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 398 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(08924223595)ని సంప్రదించవచ్చు.

నరసాపురం ఆనకట్ట..
ఖరీఫ్ ఆందోళనకు అడ్డుకట్ట

- ఆనకట్ట ఆయకట్టు పరిధిలో ముమ్మరంగా వరి నాట్లు
- ప్రాజెక్టు నిర్మాణం దివంగత మహానేత వైఎస్సార్ చలవే


వరి నాట్లకు సాగునీరు అందిస్తున్న నరసాపురం ఆనకట్ట


నూతలగుంటపాలెం వద్ద ముమ్మరంగా వేస్తున్న వరి నాట్లు

దివంగత మహానేత డాక్టర్ వైఎస్సార్ హయాంలో నిర్మించిన నరసాపురం ఆనకట్ట కశింకోట మండలంలోని ఐదు గ్రామాల రైతుల్ని ఆదుకుంటోంది. ఏటా ఖరీఫ్ వరి సాగుకు వరుణుడు కనికరించకపోయినా.. రైతుల్లో ధీమా పెంచుతోంది. ఈ ఏడాది కూడా మండలంలో రైతులు వరుణుడి కోసం నిరీక్షిస్తుంటే.. ఆనకట్ట ఆయకట్టు రైతులు మాత్రం ముమ్మరంగా వరి నాట్లు వేసే పనిలో ఉన్నారు.

కశింకోట: మండలంలో ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాల్లేవు. దీంతో చాలా చోట్ల వరి నాట్లపై రైతులు దిగాలు పడుతున్నారు. అయితే దివంగత మహానేత వైఎస్సార్ హయాంలో నిర్మాణం చేపట్టిన నరసాపురం ఆనకట్ట కింద సాగులో ఉన్న ఆయకట్టుకు మాత్రం పుష్కలంగా నీరందుతోంది. దీంతో ఇప్పటికే ఖరీఫ్ వరి సాగు రైతులు 70 శాతం మేర నాట్లు పూర్తి చేశారు. ఆనకట్ట పరిధిలో మండలానికి చెందిన ఐదు ఆయకట్టు గ్రామాలతో పాటు, యలమంచిలిలోని పెంజెరువు ప్రాంతంలో కూడా వరి నాట్లు జోరందుకున్నాయి.

ముమ్మరంగా వరినాట్లు

మండలంలోని అమీన్‌సాహెబ్‌పేట వద్ద దివంగత సీఎం వైఎస్సార్ హయాంలో రైతుల అభ్యర్థన మేరకు రూ.16.17 కోట్లతో నరసాపురం ఆనకట్ట నిర్మాణానికి అనుమతులు మంజూరు చేశారు. 2009లో ఆనకట్టను నిర్మించారు. ఆయన తర్వాత ఆనకట్ట గేట్ల ఏర్పాటుకు నిధుల సమస్య తలెత్తింది. గత టీడీపీ ప్రభుత్వం చొరవ చూపకపోవడంతో విశాఖ డెయిరీ రూ.కోటీ 30 లక్షలు కేటాయించి, 2016లో గేట్లను అమర్చింది. 2017 నుంచి ఈ ఆనకట్ట ద్వారా ఆయకట్టుకు చెందిన సుమారు 3,500 ఎకరాలకు సాగునీటిని అందిస్తున్నారు. గత నెలలో అడపా దడపా కురిసిన వర్షాలకు రైతులు నారుమళ్లు వేశారు. అవి వర్షాలు లేక నాట్లు వేయలేని పరిస్థితి. శారదానదిలో ఎగువ ప్రాంతం నుంచి వరద నీరు వచ్చి చేరడంతో నరసాపురం ఆనకట్ట నుంచి ఆయకట్టుకు సమృద్ధిగా సాగునీరు చేరుతోంది. దీంతో గత కొద్ది రోజులుగా ముమ్మరంగా వరి నాట్లు వేస్తున్నారు.

ఆయకట్టు రైతుల్లో ఆనందం

ఆనకట్ట కింద ఉన్న ఉన్న నూతలగుంటపాలెం, శివారు అచ్యుతాపురం, ఏనుగుతుని, పల్లపు సోమవరం, నరసింగబిల్లి గ్రామాల్లో జోరుగా వరి నాట్లు వేస్తున్నారు. సుమారు 500 ఎకరాల్లో 70 శాతం మేర నాట్లు జరిగినట్లు సమాచారం. వీటిలో అచ్యుతాపురం, నరసింగబిల్లి మినహా మిగిలిన గ్రామాల్లో నాట్లు దాదాపు ముగింపు దశకు చేరుకున్నాయి. వర్షాలు కురవనప్పటికి వైఎస్సార్ హయాంలో మంజూరు చేసిన నిధులతో నిర్మించిన నరసాపురం ఆనకట్ట వల్ల ప్రస్తుతం వరి నాట్లు వేయగలుగుతున్నామని ఆయకట్టు రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలంలో కొండ గెడ్డల నుంచి వచ్చే నీరు తోడై ఆనకట్ట నుంచి నీటి సరఫరా ప్రారంభమైనప్పటి నుంచి సమృద్ధిగా పంటలు పండుతున్నాయని, ఇదంతా వైఎస్సార్ చలవేనని రైతులు పేర్కొంటున్నారు.

వైఎస్సార్ పెట్టిన భిక్ష



రెండెకరాల్లో వరి సాగు చేస్తున్నాం. వర్షాలు కురవలేదు. దీంతో నారు ఎలా వేయాలా అని సతమతమవుతున్న తరుణంలో నరసాపురం ఆనకట్ట నుంచి అందిస్తున్న సాగునీరు వరంలా మారింది. వరి నాట్లు వేయడానికి ఎంతగానో దోహదపడుతుంది. ఇదంతా దివంగత మహానేత వైఎస్సార్ పెట్టిన భిక్షే.

– గెంజి మాణిక్యం, రైతు

ఆనకట్ట లేకుంటే అంతే..



నరసాపురం ఆనకట్ట నిర్మించడం వల్ల ఏటా వరి సాగుకు ఇబ్బందుల్లేకుండా ఉన్నాయి. వర్షాలు కురవక, వరి నారు ఎండిపోతున్న పరిస్థితిలో ఆనకట్ట నుంచి వస్తున్న శారదానది నీరు మాకు ప్రధాన ఆసరాగా నిలుస్తోంది. ఈ నీటితోనే నారు మడులు వేశాం. ఇపుడు నాట్లు కూడా ధైర్యంగా పూర్తి చేయగలుగుతున్నాం.

– చిక్కాల నూకరాజు, రైతు

ఆయకట్టులో తుది దశకు వరి నాట్లు

మండలంలోని నరసాపురం ఆనకట్ట నుంచి సాగునీరు ప్రవహిస్తుండటంతో ఆయకట్టు గ్రామాల్లో ముమ్మరంగా వరి నాట్లు జరుగుతున్నాయి. నూతలగుంటపాలెం, ఏనుగుతుని, పల్లపు సోమవరం గ్రామాల్లో వరి నాట్లు దాదాపు చివరి దశకు వచ్చాయి. నరసింగబిల్లి, అచ్యుతాపురం గ్రామాల్లో నాట్లు జోరుగా జరుగుతున్నాయి.

– స్వప్న,
మండల వ్యవసాయ అధికారి, కశింకోట.

ఆధ్యాత్మిక కార్యక్రమాల్లో దిబ్బవీధి భేష్


శ్రీసీతారామ దేవస్థానం ప్రార్థనా మందిరాన్ని ప్రారంభిస్తున్న దాడి వీరభద్రరావు

తుమ్మపాల: ఆధ్యాత్మిక, క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాల నిర్వాహణలో దిబ్బవీధి జిల్లాలోనే పేరొందిందని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు అన్నారు. పట్టణంలోని దిబ్బవీధి శ్రీసీతారామ దేవస్థానం ఆధ్వర్యంలో రూ.8 లక్షలతో నిర్మించిన ప్రార్థనా మందిరాన్ని ప్రారంభించి, మాట్లాడారు. దేవస్థానం అనుబంధ సంస్థలైన శ్రీగౌరీ నాట్యమండలి, శ్రీగౌరీ బాలగణపతి క్రీడా సంఘంలు గత 40 ఏళ్లుగా చేపడుతున్న క్రీడా, సాంస్కృతిక కార్యక్రమాలను ప్రశంసించారు. ఇటీవల కొబ్బరి తోటలో కల్యాణ వేదిక నిర్మాణం, ఇపుడు ప్రార్థనా మందిరం ఏర్పాటుపై ఆలయ కమిటీని అభినందించారు. 81వ వార్డు కార్పొరేటర్ పీలా లక్ష్మీసౌజన్య మాట్లాడుతూ ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామన్నారు. దిబ్బవీధి ప్రధాన రహదారి అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించామని, త్వరలో పనులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 81వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి పీలా రాంబాబు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ పీవీ జగన్‌మోహన్‌రావు, దాతలు కడింశెట్టి దీలిప్‌కుమార్, కాండ్రేగుల నూకఅప్పారావు, ఆలయ చైర్మన్ దాడి భాస్కరరావు, గౌరవ అధ్యక్షుడు కాండ్రేగుల అప్పారావు, కోశాధికారి మద్దాల నూకజగదీశ్వరరావు పాల్గొన్నారు.

దుప్పుతూరుకు అంబులెన్స్ వితరణ


అంబులెన్స్ తాళాలు అందిస్తున్న సైనా ప్రతినిధులు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని దుప్పుతూరుకు అంబులెన్స్‌ను సైనా లేబొరేటరీ బహూకరించింది. గ్రామ ప్రజల ఆరోగ్య అవసరాలకు ఈ అంబులెన్స్‌ను ఉపయోగించుకోవచ్చని లేబొరేటరీ ప్రతినిధులు ఎంపీ రామేశ్వరరావు, తాతారావు నాయుడు, మేనేజర్ దొరబాబు పేర్కొన్నారు. ఈ మేరకు అంబులెన్స్ తాళాలను గ్రామ సర్పంచ్ దేశంశెట్టి శంకరరావుకు అందించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఎమ్మెల్యే కన్నబాబురాజు సహకారంతో గ్రామాన్ని అభివృద్ధి చేసుకున్నామని తెలిపారు. గ్రామస్తుల అవసరాలకు అంబులెన్స్‌ను అందించిన లేబొరేటరీ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు.

చిరస్మరణీయుడు రాజీవ్ గాంధీ


రాజీవ్‌గాంధీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు


కశింకోటలో రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

అనకాపల్లిటౌన్: పంచాయతీరాజ్ వ్యవస్థను పటిష్టం చేసిన రాజీవ్ గాంధీ దేశ రాజకీయాల్లో చిరస్మరణీయుడని కాంగ్రెస్ పార్టీ అసెంబ్లీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఐ.ఆర్.గంగాధర్ అన్నారు. పార్టీ కార్యాలయంలో ఆదివారం రాజీవ్‌గాంధీ 79వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలకు కేంద్రం నిధులను నేరుగా వచ్చేలా సంస్కరణలు తీసుకొచ్చారని కొనియాడారు. దేశంలో 18 ఏళ్లకే ఓటు హక్కు కల్పించి, దేశ రాజకీయాల్లో యువకులను భాగస్వామ్యం చేశారని వివరించారు. అంతకు ముందు రాజీవ్ చిత్రపటానికి పూలమాల వేసి, నివాళులర్పించారు. పార్టీ నాయకులు రాంప్రసాద్, రాష్ట్ర లీగల్‌సెల్ కో ఆర్డినేటర్ అవినాష్, నాయకులు టేకుపూడి సంతోష్ పాల్గొన్నారు.

కశింకోట: కశింకోటలో మాజీ ప్రధాని, భారత రత్న రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా స్థానిక పంచాయతీ ప్రధాన రహదారిలో ఉన్న రాజీవ్‌గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ప్రధానమంత్రిగా దేశానికి అందించిన సేవలను ప్రస్తుతించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీధర్, జిల్లా న్యాయ విభాగం అధ్యక్షుడు సూరా శ్రీనివాస్, జిల్లా పరిశోధన సమన్వయకర్త బోయిన భానుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

సమగ్ర ఓటరు సర్వే పరిశీలన


ఓటర్ల జాబితా పరిశీలనలో తహసీల్దార్

నక్కపల్లి: మండలంలో వివిధ గ్రామాల్లో జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్ అంబేడ్కర్ ఆదివారం పరిశీలించారు. వేంపాడు, నెల్లిపూడి తదితర గ్రామాల్లో జరుగుతున్న ప్రత్యేక డ్రైవ్‌లో గృహాలను సందర్శించారు. బీఎల్వోల పనితీరును పరిశీలించారు. ఎంతమంది వివరాలు సేకరించారు? కొత్త ఓటర్ల కోసం ఎన్ని దరఖాస్తులు వచ్చాయనే వివరాలపై ఆరా తీశారు. బీఎల్వోలంతా ప్రతి గృహాన్ని సందర్శించాలని సూచించారు.

పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీబిడ్డా క్షేమం


తల్లీబిడ్డతో డాక్టర్ వెంకటేష్, వైద్య సిబ్బంది

రాంబిల్లి: పీహెచ్‌సీలో ప్రసవాలతో తల్లీ బిడ్డలు క్షేమంగా, ఆరోగ్యంగా ఉండే అవకాశాలు మెండుగా ఉంటాయని దిమిలి పీహెచ్‌సీ డాక్టర్ వెంకటేష్ అన్నారు. స్థానిక పీహెచ్‌సీలో ఆదివారం ప్రసవం జరిగింది. దిమిలి గ్రామానికి చెందిన భవాని ఆడబిడ్డకు జన్మనిచ్చింది. ఈ ప్రసవాన్ని డాక్టర్ వెంకటేష్ పర్యవేక్షణలో వైద్య సిబ్బంది నిర్వహించారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని వైద్యాధికారి తెలిపారు. తమ పీహెచ్‌సీలో ప్రసవాలకు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణకు ఎంతగానో ప్రాధాన్యత ఇస్తోందన్నారు. పీహెచ్‌సీల్లో వైద్యుల పర్యవేక్షణలో ఉచితంగా ప్రసవాలు చేయడమేగాక, అవసరమైన అన్ని మందులు అందిస్తున్నట్లు తెలిపారు. అత్యవసర సమయంలో ప్రసవానికి పట్టణాలకు పరుగుతీయాల్సిన పనిలేకుండా స్థానిక పీహెచ్‌సీల్లో అన్ని రకాల సౌకర్యాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అత్యవసరమైతే నిపుణులైన వైద్యులను రప్పించి, వైద్య సేవలు స్థానికంగానే అందిస్తున్నట్లు వెల్లడించారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శభాష్ పోలీస్


లంకెలపాలెం కూడలిలో గోతులు పూడ్చుతున్న పరవాడ పోలీసులు

పరవాడ: జాతీయ రహదారిలో లంకెలపాలెం కూడలి వద్ద అధ్వానంగా ఉన్న రహదారి బాగు కోసం పరవాడ పోలీసులు నడుంబిగించారు. ప్రయాణికుల అవస్థలను గుర్తించిన పరవాడ ఏఎస్‌ఐ సత్యనారాయణ మిల్లర్లతో చర్చించారు. వారందించిన సిమెంటు కలిపిన పిక్కను పలువురు సిబ్బందితో కలిసి గోతుల్లో వేసి పూడ్చారు. ఏఎస్‌ఐను, హెచ్‌సీ శివ, హోంగార్డు శ్రీనును ప్రయాణికులు అభినందించారు.

పార్టీ కోసం శ్రమించే వారికి తగిన గుర్తింపు

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్


మీడియాతో మాట్లాడుతున్న బొడ్డేడ ప్రసాద్

అనకాపల్లిటౌన్: పార్టీలో కష్టపడి పనిచేసిన వారికి పదవులు వాటంతటవే వస్తాయని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ అన్నారు. స్థానిక రింగ్‌రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఆదివారం విలేకర్లతో ఆయన మాట్లాడారు. ఏపీ ఇన్‌ల్యాండ్ వాటర్ వేస్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దంతులూరి దిలీప్‌కుమార్ విజయవాడ నుంచి అనకాపల్లికి చేరుకోనున్న సందర్భంగా అనకాపల్లి రైల్వేస్టేషన్‌లో ఘన స్వాగతం పలకనున్నట్లు తెలిపారు. సోమవారం ఉదయం పార్టీ కార్యాలయం నుంచి ర్యాలీగా మళ్ల బ్రదర్స్, చిననాలుగురోడ్ల కూడలి, నెహ్రూచౌక్, రామచంద్ర థియేటర్ మీదుగా మండలంలో తుమ్మపాలకు చేరుకుని, అక్కడున్న బంగ్రారాజు కల్యాణమండపంలో సమావేశానికి ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కష్టపడి పని చేసే ప్రతి ఒక్కరికి సీఎం జగన్‌మోహన్ రెడ్డి గుర్తింపు ఇస్తారన్నారు. రానున్న ఎన్నికల్లో ముఖ్యమంత్రిగా జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ గెలిపించే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, తుమ్మపాల సర్పంచ్ తట్టా పెంటయ్యానాయుడు, పార్టీ నేత గోవింద తదితరులు పాల్గొన్నారు.

కశింకోట: రాష్ట్ర ఇన్‌లాండ్ వాటర్ వేస్ అథారిటీ బోర్డు చైర్మన్‌గా దంతులూరి దిలీప్‌కుమార్ నియమితులై సోమవారం ఉదయం 8 గంటలకు రైలులో అనకాపల్లి రైల్వే స్టేషన్‌కు చేరుకుంటారని, ఆయనకు ఘన స్వాగతం పలికేందుకు మండలం నుంచి పార్టీ సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, గృహ సారథులు, కన్వీనర్లు తరలి రావాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు, వైఎస్సార్ సీపీ సచివాలయ మండల కన్వీనర్ కలగా గున్నయ్యనాయుడు ఆదివారం ఓ ప్రకటనలో కోరారు. అక్కడి నుంచి పార్టీ కార్యాలయం చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను కలిసి, దిలీప్‌కుమార్ సొంత గ్రామం తుమ్మపాల వరకు బైక్ ర్యాలీ జరుగుతుందన్నారు.

తెలుగుకు వెలుగునిద్దాం


సమావేశంలో మాట్లాడుతున్న శ్రీకాంత్


మహాభారతంపై వ్యాసరచనలో విద్యార్థులు

అనకాపల్లిటౌన్: మాతృభాష కన్నతల్లితో సమానమని, ఇతర భాషలు నేర్చుకుంటూనే తెలుగుభాష ప్రాముఖ్యతకు కృషి చేయాలని రామ్‌కీ ఫౌండేషన్ ప్రాంతీయ పర్యవేక్షణ అధికారి కె.శ్రీకాంత్ అన్నారు. స్థానిక హిమశేఖర్ డిగ్రీ కళాశాల ఆవరణలో తెలుగు భాషా పరిరక్షణ సమితి, రామ్‌కీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలుగుకు వెలుగునిద్దాం పేరిట ఇతర రాష్ట్రాల్లో వారి ప్రాంతీయ భాషల్లో దుకాణాల బోర్డులు పెట్టినట్లే, మన రాష్ట్రంలో కూడా వ్యాపారస్తులందరూ తమ దుకాణాల ముందు తెలుగులో బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలుగు నేలలో జన్మించిన ప్రతి ఒక్కరూ మహా భారతంపై పఠనాసక్తిని పెంచుకోవాలన్నారు. తెలుగు భాషా పరిరక్షణ సమితి ప్రతినిధులు కె.రామ్మోహన్‌రావు, జి.రంగబాబులు మాట్లాడుతూ ప్రపంచ దేశాలు తెలుగుభాష గొప్పదనాన్ని గుర్తించాయన్నారు., నేటి సమాజంలో పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించేందుకు మహాభారతం, రామాయణం చదివేలా ప్రోత్సహించాలని కోరారు. అనంతరం కళాశాల ఆవరణలో విద్యార్థులకు మహాభారతంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా, సుమారు 200 మంది విద్యార్థులు హాజరయ్యారు. 27న వక్తృత్వ పోటీలు నిర్వహిస్తామన్నారు. పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఈ నెల 29న తెలుగు భాషా దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక వివేకానంద ఫంక్షన్ హాల్లో బహుమతులు ప్రదానం చేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు పి.అమరజ్యోతి, కోరాడ అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి అంగన్‌వాడీ కార్యకర్తల వినతి


మంత్రి అమర్‌నాథ్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏపీ అంగన్‌వాడీ వర్కర్ల సంఘం ప్రతినిధులు

అనకాపల్లి రూరల్: తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఐటీ శాఖా మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌కు ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ సంఘం ప్రతినిధులు ఆదివారం వినతిపత్రం అందించారు. గాజువాక, మిందిలోని మంత్రి నివాసంలో ఆయనను కలిసిన ప్రతినిధులు వారి సమస్యలు తెలిపారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని, సంక్షేమ పథకాలు అమలు చేయాలని, వంట గ్యాస్‌ను ప్రభుత్వమే నేరుగా సరఫరా చేయాలని, మెనూ చార్జీలు పెంచాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యుటీ, పదోన్నతులు, ఆన్‌లైన్ డేటా భారం తగ్గింపు, మినీ అంగన్‌వాడీ కేంద్రాల స్థాయి పెంపు, టీఏ, డీఏల చెల్లింపు తదితర అంశాలపై మంత్రికి వినతిపత్రం ద్వారా మొరపెట్టుకున్నారు. మంత్రిని కలిసిన వారిలో సంఘం(సీఐటీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి మజ్జి నాగ శేషు, ఉపాధ్యక్షులు కె.కాసులమ్మ, కె.ఉమానారాయణమ్మ తదితరులున్నారు.

గ్రామాల్లో ధార్మిక కమిటీల బలోపేతానికి కృషి


సమరసత సేవా ఫౌండేషన్ శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సత్యనారాయణ

అచ్యుతాపురం(అనకాపల్లి): గ్రామాల్లో ధార్మిక కమిటీలు బలపడాలని సమరసత సేవా ఫౌండేషన్ పరియోజన ప్రముఖ్ శిరియాల సత్యనారాయణ పిలుపునిచ్చారు. అచ్యుతాపురం మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో ఆదివారం సమరసత సేవా ఫౌండేషన్ ఉత్తరాంధ్ర ప్రచారకులు ఆడారి గంగాధర్ అధ్యక్షతన గ్రామ కన్వీనర్లకు శిక్షణా తరగతులు నిర్వహించారు. ప్రజల్లో ఆధ్యాత్మిక భావం పెంపొందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడారు. ప్రముఖ్ పోతు రంగారావు మాట్లాడుతూ దేవాలయాలు శక్తివంతంగా మారాలని, వారం వారం భజనలు, ప్రతి నెలా సామూహిక హారతి, నగర సంకీర్తన నిర్వహించాలని కోరారు. ఫౌండేషన్ సబ్ డివిజన్ కన్వీనర్ బి.వి.రమణ మాట్లాడుతూ 31న రక్షాబంధన్ కార్యక్రమాన్ని ధార్మిక కమిటీ ఆధ్వర్యంలో దేవాలయాల్లో నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ద్వారపురెడ్డి బాబ్జి, రెడ్డి అప్పలనాయుడు, గుడివాడ రమణ, ఆడారి త్రినాథ్, చోడపల్లి సత్యం, చింతకాయల గగన్ కుమార్, కొల్లి అప్పారావు, వెన్నెల అప్పలనాయుడు పాల్గొన్నారు.

ఘనంగా సత్యసాయి జయంతి వేడుకలు


వేంపాడు సత్యసాయి మందిరంలో భజనలు చేస్తున్న భక్తులు

నక్కపల్లి: భగవాన్ సత్యసాయిబాబా 100వ జయంతిని పురస్కరించుకుని మండలంలోని వేంపాడు సత్యసాయి ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువజాము నుంచే మందిరంలో భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. పేదలకు వస్త్రదానం చేశారు. పరిసర ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.